

నవభూమి

నిజామాబాద్

అనుబంధం

30 మే,2025 శుక్రవారం పేజీలు:3

www.epaper.navabhoomi.in


## జొన్నల బకాయి

# రూ.100 కోట్లు



**నిజామాబాద్, -నవభూమి:** జొన్న రైతుల పరిస్థితి అధ్వానంగా మారింది. కొనుగోళ్లలో జాప్యం, అకాల వర్షాల కారణంగా రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతున్నది. పంట కొనుగోళ్లలో తరుగు కూడా అన్నదాతలకు గుదిబండగా మారింది. యాసంగిలో రైతులు సాగుచేసిన జొన్నలను ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా సేకరిస్తున్నది. కామారెడ్డి జిల్లాలో 16 ప్రాథమిక సహకార సంఘాల ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి జొన్నలు సేకరిస్తున్నది.ఈసారి సగటున ఎకరాకు 15 క్వింటాళ్ల వరకు దిగుబడి రాగా, కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటాకు రూ.3,371 చొప్పున పంటను సేకరిస్తున్నారు. ప్రైవేటు వ్యాపారులు రూ.2,600 మాత్రమే చెల్లిస్తుండడంతో రైతులు కొనుగోలు కేంద్రాల వైపు మొగ్గు చూపారు. ప్రస్తుతం జొన్నల సేకరణ ముగింపు దశకు చేరింది. పంట విక్రయించి రోజులు గడుస్తున్నా రైతుల ఖాతాల్లో ఇప్పటికీ డబ్బులు పడలేదు. దీంతో కర్షకులు లబోదిబోమంటున్నారు.దాదాపు రూ.100 కోట్లు మేర బకాయిలు పేరుకు పోయినట్లు తెలిసింది. మరోవైపు, పలు చోట్ల కొనుగోలు కేంద్రాల నిర్వాహకుల దోపిడీతో రైతులు విలవిల్లాడుతున్నారు. సంచి బరువు ఎంత ఉంటే అంతే పరిమాణంలో జొన్నలను తీసుకోవాలని చెబుతున్నప్పటికీ, అదనంగా కిలోన్నరకు పైగానే దోపిడీ చేస్తుండడంపై మార్క్‌ఫెడ్, సహకార శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.శ్రమజీవుల దోపిడీ..ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో రైతులు తీవ్ర దోపిడీకి గురవుతున్నారు. వడ్ల కొనుగోళ్లలో భారీగా తరుగు తీస్తూ రైస్‌మిల్లర్లు అన్నదాతలను దగా చేశారు. కొన్ని చోట్ల 40 కిలోల బస్తాకు 3-5 చొప్పున తరుగు పేరిట దోచుకున్నారు. పసుపు రైతులకు గిట్టుబాటు రాకుండా వ్యాపారులు సిండికేట్‌గా మారి తక్కువ ధరకే పంటను కొనుగోలు చేశారు. ఆమ్‌చూర్ రైతుల విషయంలోనూ నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ వేదికగా భారీ ఎత్తున దోపిడీ తంతు నడిచింది. తాజాగా జొన్న కొనుగోళ్ల విషయంలోనూ ఇలాగే దోపిడీ కొనసాగింది. ఆరుగాలం శ్రమించే అన్నదాతకు కష్టాలు తప్పడం లేదు.పంట విత్తనాల కొనుగోలు నుంచి మార్కెట్‌కు తరలించే వరకు అడుగడుగునా ఇబ్బందులే ఎదురవుతున్నాయి. కొన్నిరోజులుగా కురుస్తున్న అకాల వానలు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఇక, 72 గంటల్లో జొన్న రైతులకు డబ్బులు చెల్లించాల్సి ఉండగా, రోజులు గడుస్తున్నా పైసా కూడా ఇవ్వట్లేదు. వానాకాలం సీజన్‌కు ముందే వానలు కురుస్తున్నాయి. సాగుకు అనుకూల వాతావరణం ఏర్పడడంతో విత్తనాల ను సిద్ధం చేసుకోవడానికి రైతులు ఆసక్తి చూపుతున్నారు. చేతిలో డబ్బులు లేకపోవడంతో దిక్కుతోచక ప్రైవేటు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొన్నదని వాపోతున్నారు.రూ.100 కోట్లు విడుదల అయ్యేనా ఉమ్మడి జిల్లాలో జొన్నల సాగుకు కామారెడ్డి పెట్టింది పేరు. నీటి వసతి అంతగా లేని ప్రాంతాల్లో జొన్నలను ఎక్కువగా రైతులు సాగు చేస్తుంటారు. ఇందులో ఎల్లారెడ్డి, బాన్సువాడ, జుక్కల్ ఏరియాలో ఏటా భారీగా జొన్న సాగు జరుగుతున్నది. నిజామాబాద్ జిల్లాలో కొద్దిమంది మాత్రమే జొన్నలను సాగు చేస్తున్నారు. ఈ సీజన్‌లో జొన్న సాగు చేసిన రైతులు అచ్చంగా పసుపు రైతుల మాదిరిగానే దోపిడీకి గురయ్యారు. మొదట్లో రైతుల చేతుల్లో పంట ఉన్నప్పుడు వ్యాపారులు గద్దల్లా వాలిపోయారు. అందిన కాడికి రూ.2600 చొప్పున క్వింటాకు చెల్లించి జొన్నలు సేకరించారు. తీరా సీజన్ ముగింపు సమయానికి కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రాలను ప్రారంభించింది.కామారెడ్డి జిల్లాలో ఇప్పటి వరకు 2.96 లక్షల క్వింటాళ్ల జొన్నలను కొనుగోలు చేసినట్లు మార్క్‌ఫెడ్ అధికారులు చెబుతున్నారు. వీటి విలువ రూ.100 కోట్లు ఉంటుంది. ఇందులోంచి ఇప్పటివరకూ రైతుకు నయా పైసా కూడా చెల్లించలేదు. ధాన్యం కొనుగోళ్లలో తీవ్ర జాప్యం వహించిన రాష్ట్ర ప్రభుత్వం.. జొన్నల సేకరణలోనూ తీవ్రమైన నిర్లక్ష్యం చేస్తున్నదని రైతాంగం మండిపడుతున్నది. పంట కోతల సమయంలో తెరవాల్సిన కొనుగోలు కేంద్రాలను ఆలస్యంగా తెరవడంతో అప్పటికే పెద్ద మొత్తంలో జొన్నలు దళారుల పాలయ్యాయి. ఫలితంగా రైతులు నష్టపోవాల్సి వచ్చింది. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో జొన్నలను అమ్ముకునేందుకు రైతులు సిద్ధపడగా చేతిలో పంట లేదు. కొనుగోలు కేంద్రాలకు వస్తున్న పంటలో వ్యాపారులే విక్రయిస్తున్నట్లుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి.రెండు రోజుల్లో చెల్లింపులు జరుగుతాయి..జొన్నల కొనుగోళ్లకు సంబంధించిన చెల్లింపులపై ప్రభుత్వానికి నివేదించాం. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. రెండు రోజుల్లోనే మొత్తం చెల్లింపుల ప్రక్రియ పూర్తి అవుతుంది. నేరుగా రైతుల ఖాతాల్లోనే కనీస మద్దతు ధర ప్రకారం డబ్బులు జమ అవుతాయి.

## పద్మశ్రీ పురస్కారం అవార్డు గ్రహీత మందకృష్ణ

# చిత్రపటానికి పాలాభిషేకం



**కోటగిరి-నవభూమి:** నిజామాబాద్ జిల్లా కోటగిరి మండల కేంద్రం లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో పద్మశ్రీ పురస్కారం అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగ చిత్రపటానికి ఎమ్మార్పీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి పోచ్చిరాం ఆధ్వర్యంలో గురువారం పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సహాయ కార్యదర్శి పోచిరాం మాట్లాడుతూ ఎక్కడ అన్యాయం జరిగితే అక్కడ న్యాయం జరిగేంత వరకు పోరాట పట్టిన ఉన్న ఉద్యమ నాయకుడు మందకృష్ణ మాదిగ అని అన్నారు.ఈ నెల 27న ఢిల్లీలో భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ సమక్షంలో భారత రాష్ట్రపతి గౌరవ ద్రౌపతి ముర్మ చేతుల మీదుగా పద్మశ్రీ అవార్డును మందకృష్ణ మాదిగ అందుకున్నందుకు చాలా ఆనందంగా ఉందన్నారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, టపాసులు బాణ సంచాలు కాల్చారు అనంతరం సీట్లు పంచుకున్నారు. అనంతరం మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. మాదిగ జాతికి జరుగుతున్న అన్యాయం గుర్తించి తమ జాతికి వివరిస్తూ ఎన్నో ఉద్యమాలు చేసి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కళ్ళు తెరిపించారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్పీఎస్ నాయకులు శ్రీకాంత్, కన్నం శ్రీనివాస్, దినేష్, దావులయ్య, కన్నం సాయిలు, బీ సాయిలు, సాయినాథ్, వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

# జనావాసాల్లోకి జింకలు



# కాంగ్రెస్ సమావేశంలో ఫొటో రగడ



## పంటల మార్పిడీతోనే సంవృద్ధిగా పోషకాలు.. శాస్త్రవేత్త విజయ్ కుమార్



**పోతంగల్ –నవభూమి:** ఒకే రకమైన పంటలను సాగు చేయడం వల్ల పొలాల్లో భూసారం తగ్గుతుందని దీంతో పంట దిగుబడి తగ్గుతుందని, పంటల మార్పిడి వల్ల భూమిలోని పోషకాలు సంవృద్ధిగా అందుతాయని సస్యరక్షణ శాస్త్రవేత్త పీ విజయ్ కుమార్ అన్నారు. మండలంలోని హెగ్డోలి లో కృషి విజ్ఞాన కేంద్రం రుద్రూర్ శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అనుసంధానంతో రైతులకి రైతు మంగిట్లో శాస్త్రవేత్తలు అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు.యూరియా వాడకాన్ని తగ్గించడం, అవసరం మేరకే రసాయనాల వినియోగంపై శాస్త్ర వేత్తలు రైతులకు అవగాహన కల్పించారు. రైతులు ఎరువుల దుకాణాల్లో కొనుగోలు చేసిన విత్తనాలకు తప్పనిసరిగా రశీదు తీసుకోవాలని, పంట పూర్తయ్యే వరకు దానిని భద్రపరుచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతు, పుప్పాల శంకర్, డాక్టర్ ఎం శ్వేత, మండల వ్యవసాయ అధికారి నిషిత, పశు వైద్య అధికారి సురేష్ కుమార్, రైతులు నాగం సాయిలు, అర్జున్ రావు, సాయినాథ్, శివరాజ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## యోగా తోనే శారీరక, మానసిక ఆరోగ్యం



**పోతంగల్ –నవభూమి:** :యోగా సాధనతోనే శారీరక, మానసిక ఆరోగ్యం పొందవచ్చని యోగా ఇన్ స్ట్రక్టర్ లు సతీష్ గౌడ్, జ్యోతి అన్నారు. అంతర్జాతీయ యోగ వారోత్సవాల్లో భాగంగా గురువారం మండల కేంద్రలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా ఆసనాలు వేయించారు.ప్రజలకు యోగా వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అనుసంధానంగా నిర్వహిస్తున్న యోగాకేంద్రాన్ని మండల ప్రజలు సద్వినియోగించుకోవాలని తెలిపారు. మండలకేంద్రంలోని ఆరోగ్య కేంద్రములో ప్రతిరోజు ఉదయం సాయంత్రం యోగా, ఆసనాలు అభ్యాసం చేస్తున్నామని, దీంతో సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండడానికి ఈ ఆసనాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. ఉదయం సాయంత్రం మండల ప్రజలు హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్లు రమణి, శాంత, రేష్మ తదితరులు పాల్గొన్నారు.

## మీనాక్షి నటరాజన్‌ను కలిసిన మహేందర్ రెడ్డి

**రామారెడి–నవభూమి:** తెలంగాణ కాంగ్రెస్ కమిటీ ఇన్చార్జ్ మీనాక్షి నట్రాజన్ ను గురువారం జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు గిరెడ్డి మహేందర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ శ్రేణులు ఐక్యంగా కలిసి పనిచేయాలని సూచించినట్లు తెలిపారు.



# జనావాసాల్లోకి జింకలు




**బోధన్, –నవభూమి:** అడవిలో ఉండాల్సిన జింకలు.. జనావాసాల్లోకి రావడంతో మృత్యువాత పడుతున్నాయి. గ్రామాల్లోకి వచ్చిన జింకలను కుక్కలు వేటాడి చంపేస్తున్నాయి. దీనికి ఇసుక మాఫియా కూడా కారణమవుతున్నదని ప్రజలు ఆరోపిస్తున్నారు. పచ్చని పచ్చిక బయళ్లలోనూ, పొదలమాటున ఉంటూ హాయిగా సంచరించాల్సిన జింకలు ఇప్పుడు జనారణ్యంలోకి వచ్చి.. కుక్కల వేటకు బలవుతున్నాయి. నిజామాబాద్ జిల్లాలోని మంజీరా తీరం జింకలు, అనేక రకాల పక్షులకు నిలయం.ఇక్కడ జింకలతోపాటు కృష్ణ జింకలు విహరిస్తూ ఉంటాయి. నాలుగు రోజులుగా కొన్ని జింకలు, జింక పిల్లలు గ్రామాల వైపు రావడం, కుక్కల దాడిలో మృత్యువాత పడడం ఆందోళన కలిగిస్తున్నది. ఉమ్మడి కోటగిరి మండలంలో నాలుగు రోజులుగా కొనసాగుతున్న జింకల మృత్యుఘోష పలువురిని కలిచివేస్తున్నది. గత ఆదివారం పోతంగల్ మండలం సోంపూర్ శివారులో కృష్ణ జింకపై కుక్కలు దాడిచేసి చంపేశాయి. ఆ మరుసటి రోజు కోటగిరి మండలం యాద్గార్పూర్‌లో మరో కృష్ణజింక కుక్కల వేటతో మృత్యువాత పడింది. మంగళవారం సోంపూర్‌లో మరో జింక పిల్లను కుక్కలు వేటాడగా.. అదృష్టవశాత్తు అది పెద్దగా గాయపడకపోవడంతో దానికి అటవీశాఖ అధికారులు ప్రాథమిక చికిత్స అందించి అడవిలో వదిలిపెట్టారు.బుధవారం కూడా మరో కృష్ణ జింకను కుక్కలు వేటాడి చంపేశాయి. వరుసగా జరుగుతున్న ఈ సంఘటనలతో మంజీరా తీర ప్రాంత ప్రజలు, జంతు ప్రేమికులు ఆందోళన చెందుతున్నారు. జింకల సహజ ఆవాసాలు అనేక కారణాలతోపాటు ఇసుక మాఫియాతో చెదిరిపోతుండడంతో అవి గ్రామాల వైపు వస్తున్నాయని వారు అంటున్నారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు బురద గుంటలు ఏర్పడడంతో అవి కుక్కలబారి నుంచి తప్పించుకోలేకపోతున్నాయి. ఇటీవల గ్రామాల్లో కుక్కల బెడద పెరిగింది. గ్రామ పంచాయతీలు నిధులు లేని కారణంగా కుక్కల నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకోలేకపోతున్నాయి.ఇసుక మాఫియా విధ్వంసం ఇది..ఇసుక కోసం మంజీరా తీరంలో జరుగుతున్న అక్రమ తవ్వకాలు, రాత్రింబవళ్లు ఇసుక రవాణా కోసం తిరిగే వాహనాల రణగొణ ధ్వనులు వన్యప్రాణులకు ఇబ్బందులు తెచ్చిపెడుతున్నాయి. ప్రశాంతంగా ఉండే మంజీరా తీరం ఇసుక అక్రమ రవాణాతో అల్లకల్లోలంగా మారుతున్నది. సహజ ఆవాసాల్లో నిత్యం సంచరించే జింకలకు ఇసుక మాఫియా ఫలితంగా ప్రాణభయం పట్టుకున్నదని, ఎటువెళ్లాలో తెలియని పరిస్థితి ఎదుర్కొంటున్నాయని పర్యావరణవేత్తలు అంటున్నారు. బోధన్ డివిజన్‌లోని మంజీరా తీరం వెంట ఇసుక తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. ఇందులో ప్రభుత్వ అనుమతి పొందిన ఇసుక క్వారీల సంగతెలా ఉన్నా.. పోతంగల్ మండలంలోని మంజీరా నదిలో ఇసుక అక్రమ తవ్వకాలు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయి. దొంగచాటుగా రాత్రుళ్లు ఇసుకను తవ్వడం, ట్రాక్టర్లు, ఇతర వాహనాల్లో నది నుంచి ఇతర ప్రాంతాలకు తరలించడం జరుగుతున్నది. ఇదే పరిస్థితి సాలూర, బోధన్, రెంజల్ మండలాల్లో కూడా ఉన్నది. ఇసుక అక్రమ రవాణాదారులు నదిలోకి, నదిలో ర్యాంప్‌ల పేరిట రోడ్లను ఏర్పాటుచేసుకోవడం కోసం పొదలు, పచ్చిక బయళ్లను తొలగిస్తున్నారు. దీంతో జింకలే కాకుండా ఆ నదీ ఈ తీరంలో విహరించే అనేక పక్షి జాతులు ఇప్పుడు కనిపించకుండా పోయాయి. మంజీర తీరంలోని ఈ ప్రకృతి విధ్వంసానికి అడ్డుకట్టవేసేంత వరకు వన్యప్రాణులు మనుగడ ప్రశ్నార్థకంగా మారుతున్నది,పంచాయతీలకు లేఖలు..జింకలను కుక్కలు వేటాడడం, వాటిని చంపడం బాధ కలిగిస్తున్నది. గ్రామాల్లో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. పంచాయతీలు కుక్కల బెడదను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం. ఈ విషయమై మా శాఖ ఉన్నతాధికారులు పంచాయతీలకు లేఖలు పంపాలని యోచిస్తున్నారుసురేశ్, సెక్షన్ ఆఫీసర్, అటవీశాఖ కుక్కల దాడిలో మరో జింక మృతి మండలంలోని టాక్లీ గ్రామంలో ఓ జింక కుక్కల వేటకు బలైంది. మేత కోసం బుధవారం వ్యవసాయ పొలాల్లోకి వచ్చిన జింకపై కుక్కలు దాడిచేశాయి. దీంతో అది అక్కడికక్కడే మృతిచెందింది. విషయాన్ని స్థానికులు అటవీశాఖ అధికారులకు తెలియజేశారు. దీంతో అక్కడికి చేరుకొని పంచనామా నిర్వహించినట్లు అటవీశాఖ సెక్షన్ ఆఫీసర్ సురేశ్ తెలిపారు.

# కాంగ్రెస్ సమావేశంలో ఫొటో రగడ

**బాన్సువాడ, –నవభూమి:** బాన్సువాడ కాంగ్రెస్ పార్టీలో విభేదాలు మరోసారి భగ్గుమన్నాయి. ఫ్లెక్సీలో ఏనుగు రవీందర్‌రెడ్డి ఫొటో పెట్టకపోవడంపై ఆయన వర్గీయులు ఆగ్రహం వ్యక్తంచేశారు. పార్టీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశాన్ని బాన్సువాడలోని ఓ ప్రైవేటు గార్డెన్‌లో మంగళవారం నిర్వహించారు. సమావేశానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల అబ్జర్వర్లు వేణుగోపాల్ యాదవ్, సత్యనారాయణగౌడ్ హాజరయ్యారు.సమావేశం సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో తమ నాయకుడు ఏనుగు రవీందర్‌రెడ్డి ఫొటో ఎందుకు పెట్టలేదని ఆయన వర్గీయులు నిరసన వ్యక్తంచేశారు. ఆయనను సమావేశానికి ఎందుకు పిలువలేదని ధ్వజమెత్తారు. ఎప్పటి నుంచో పార్టీలో కష్టపడి పనిచేస్తున్న వారిని కాదని, ఇటీవల పార్టీలో చేరిన వారి ఫొటోలు పెట్టారని సమావేశం జరుగుతున్న గార్డెన్ ఎదుట బైఠాయించి నినాదాలు చేశారు. ఎంపీ ఎన్నికల్లో సురేశ్ షెట్కార్ గెలుపు కోసం తమ నాయకుడు రవీందర్‌రెడ్డి ఎంతో కష్టపడి పనిచేశారని, నియోజకవర్గం నుంచి మంచి మెజార్టీ వచ్చేలా చూశారన్నారు.కనీస సమాచారం కూడా ఇవ్వకపోవడం ఏంటని ప్రశ్నించారు. బాన్సువాడ నియోజకవర్గంలోని కాంగ్రెస్ కార్యకర్తల బాధ తమకు తెలుసని జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి తెలిపాడు. రవీందర్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, సీఎం రేవంత్‌రెడ్డి వద్ద కూర్చొని సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తానని చెప్పాడు. ఇకపై నియోజకవర్గంలో ఎలాంటి పార్టీ సమావేశాలు జరిగినా.. మీకు తప్పకుండా సమాచారం ఉంటుందని, కలిసి పనిచేయాలని సూచించడంతో ఏనుగు వర్గీయులు నిరసన విరమించారు.



# అక్రమ ఇసుకకు అడ్డుకట్ట వేయాలి




**మద్నూర్–నవభూమి:** రాత్రింబవళ్లు ఇష్ట రాజ్యాంగ మంజీరా నది నుండి అక్రమంగా ఇసుక తరలించే వాటికి హద్దులు లేకుండా పోతున్నాయి. సోమవారం ఉదయం డోంగ్లి మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ సాయిబాబా అక్రమ ఇసుక తరలించే వాటిపై నిఘా పెట్టగా.. బొలెరో బండి పట్టుబడింది. ట్రాక్టర్లు మాత్రం అక్రమ ఇసుక తరలిస్తూ.. యధావిధిగా కొనసాగడం పట్ల ట్రాక్టర్ల విషయం ఏమిటనే చర్చ మండల ప్రజల్లో వ్యక్తం అవుతున్నాయి. అధికారులు పకడ్బందీ నిఘా పెడుతూ కొన్ని వానాలను పట్టుకుంటున్నప్పటికీ, ట్రాక్టర్ల విషయంలో మౌనం ఎందుకని ప్రజలు చర్చించుకుంటున్నారు. అక్రమ ఇసుక దందా తరలిపోకుండా చెక్పోస్టులు ఏర్పాటు చేయవలసి ఉందని పలువురు అంటున్నారు. నామమాత్రంగా అధికారులు రోడ్ల పైననే నిఘా పెట్టడం వల్ల ఎలాంటి ఉపయోగం లేదని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా కలెక్టర్ ఆదేశాల ప్రకారం .. అక్రమ ఇసుక దందాను పకడ్బందీగాతో కట్టడి చేయాలని, మండల ప్రజలు కోరుతున్నారు. పట్టుబడ్డ బొలెరో వాహనాన్ని మద్నూర్ పోలీస్ స్టేషన్ కు తరలించారు. సేఫ్ కస్టడీ కోసం పోలీస్ స్టేషన్లో పట్టుబడ్డ వాహనాన్ని సీజ్ చేసినట్లు ఆర్ఐ సాయిబాబా తెలిపారు.

# బంగారుపల్లిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు

**జుక్కల్–నవభూమి:** జుక్కల్ మండలంలోని బంగారు పల్లి మోడల్ గ్రామంలో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ గృహ పథకంలో భాగంగా లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలను వేగవంతం చేశారని జుక్కల్ ఎంపీడీవో శ్రీనివాస్ అన్నారు. గురువారం బంగారు పల్లి గ్రామాన్ని ఎంపీడీవో శ్రీనివాస్ సందర్శించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. గ్రామంలోని లబ్ధిదారులు ప్రారంభించిన ఇంటి నిర్మాణ పనులను హరితగతిన నిర్మించేందుకు నిత్యం మండల టీం పనిచేస్తుందని తెలిపారు. ప్రతిష్టాత్మకంగా తీసుకొని పనులను పూర్తి చేసేందుకు అదేవిధంగా నిర్మాణాలు పూర్తి చేసుకున్న వారికి డబ్బులు అన్ని వారి ఖాతాలో జమ చేసేందుకు పూర్తి ఏర్పాట్లు చేసేమని అన్నారు. ఎప్పటికప్పుడు పూర్తయిన పండ్లను పరిశీలించి లబ్ధిదారుల ఖాతాలో డబ్బులు వేయడం జరిగిందని, అందుకే ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు చేస్తున్న లబ్ధిదారులు పనులను వేగవంతం చేశారని తెలిపారు. ప్రస్తుతం గ్రామంలో ఒక ఇంటి నిర్మాణం స్లాబ్ వేయడం పూర్తయిందని , 2 ఇండ్లు స్లాబ్ వేసేందుకు సెంట్రింగ్ వేయడం ప్రస్తుతం జరుగుతుందని, రెండు రోజులలో పని పూర్తవుతుందని , నాలుగు గృహాలు ప్రస్తుతం గోడ నిర్మాణాలు పూర్తయినవి అని తెలియ చేసారు. ఇందిరమ్మ పథకం గృహ నిర్మాణాలను పరిశీలన కార్యక్రమంలో ఎంపీడీవోతో పాటు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



# రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి



కమ్మర్ పల్లి **–నవభూమి:** జూన్ 21, 22వ తేదీల్లో నిజామాబాద్ జిల్లా కేంద్రంలో జరిగే ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా నిజామాబాద్ రూరల్ కామారెడ్డి సంయుక్త జిల్లా కమిటీ అధ్యక్ష కార్యదర్శి ఎం. ముత్తేన్న, ఆర్.రమేష్ పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని హాసకోత్తుర్ గ్రామంలో సిజే పటేల్ బీడీ సెంటర్ లో ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘం కరపత్రాలను అవిష్కరించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతు కేంద్ర ప్రభుత్వం కార్మికులపై కక్ష కట్టి చట్టాలను రద్దుచేసి కోడ్ చట్టాలను తీసుకొచ్చిందన్నారు. కార్మికుల కడుపు కొట్టి సామ్రాజ్యవాదులకు, సంపన్నులకు దోచి పెట్టడానికే ఈ కొత్త చట్టాలను తీసుకొచ్చిందని విమర్శించారు. 8 గంటల పని దినాలు పోయి పన్నెండు గంటల పని దినంగా కేంద్ర ప్రభుత్వం కల్పించి, కార్పొరేట్ల సేవ చేయడానికి పూనుకుంటుందన్నన్నారు. కార్మిక వర్గం సంక్షేమం పట్టని కేంద్రం, అనేక కార్మిక వ్యతిరేక చర్యలు తీసుకుంటుందన్నారు. రోజురోజు ఉపాధి కోల్పోయి కార్మిక వర్గం నిరుద్యోగులుగా మారి కటిక దరిద్రులుగా మారాలని చూస్తుందన్నారు. కార్మిక వర్గం సమ్మె హక్కును కూడా లేకుండా చేయడానికి కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతుందన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కార్మిక సంక్షేమానికి అనేక హామీలు ఇచ్చినప్పటికీ, కార్మికుల సంక్షేమం కోసం ఏమాత్రం చర్యలు తీసుకోవడం లేదన్నారు. కార్మిక వర్గం మన సమస్యల పరిష్కారం కోసం పోరాటమే మార్గంగా ఎంచుకొని పనిచేయాలన్నారు. జూన్ 21, 22న నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టీయుసీఐ) రాష్ట్ర మహాసభలు జరగనున్నాయని, కార్మికులు, మేధావులు, విద్యార్థులు, రైతులు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో జిల్లా యూనియన్ ఉపాధ్యక్షులు సతేమ్మ, జిల్లా నాయకులు కే.రాజేశ్వర్, బీడీ ప్యాకర్స్ గంగాధర్, బాలయ్య, బషీర్, నర్సయ్య, కిషన్, రాజన్న, తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే తోటకు మంత్రి పదవి ఇవ్వాలి

**మద్నూర్:–నవభూమి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిన నాటినుండి నేటి వరకు రాష్ట్రంలో ఎన్నో ప్రభుత్వాలు వచ్చాయి. పోయాయి. జుక్కల్ నియోజకవర్గం నుండి గెలుపొందిన ఎమ్మెల్యేలకు మంత్రి పదవి దక్కలేదు. జుక్కల్ నియోజకవర్గాన్ని 1978లో ఎస్సీ రిజర్వుడు కాన్స్టెన్సీగా ఏర్పాటు చేసినప్పటి నుండి నేటి వరకు ఏ ఒక్క దళిత ఎమ్మెల్యేకు మంత్రివర్గంలో స్థానం లభించలేదు. జుక్కల్ నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే తోటా లక్ష్మి కాంతారావుకు మంత్రి పదవి ఇవ్వాలని గురువారం మద్నూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సౌజన్య రమేష్ అన్నారు. ఈ నేపథ్యంలో వారు మాట్లాడుతూ.. ప్రస్తుతం ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్యే తోట వెనుకబడ్డ ప్రాంత అభివృద్ధి కోసం ప్రత్యేకంగా కృషి చేస్తున్నారని అన్నారు. నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ పాఠశాల మంజూరు చేయించడం, కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు ప్రత్యేక కృషి చేయడం, జగమొండి లేండి ప్రాజెక్టు పెండింగ్ పనులు ప్రారంభం కోసం ప్రత్యేకంగా కృషి చేయడం జరిగిందన్నారు. వెనుకబడ్డ ప్రాంతంలో విద్యా, వైద్య అభివృద్ధికి ప్రత్యేకంగా కృషి చేశారన్నారు. ఈ నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్ల మంజూరు, గ్రామ గ్రామాన సీసీ రోడ్ల నిర్మాణం, మురికి కాలువల నిర్మాణం, ఇలాంటి అభివృద్ధికి ప్రత్యేకంగా పాటుపడుతున్న తోట లక్ష్మి కాంతారావుకు మంత్రివర్గంలో మంత్రి పదవి దక్కాలని ఈ సందర్బంగా డిమాండ్ చేశారు. ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గంలో దళితులకు న్యాయం జరగాలంటే నిరంతరంగా అభివృద్ధి కోసం పాటుపడే ఎమ్మెల్యే తోటా లక్ష్మి కాంతారావు కు మంత్రి పదవి ఇవ్వడంలో న్యాయం ఉందని, తమ కోరిక న్యాయమైనదని సీఎం రేవంత్ రెడ్డికి, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ హై కమాండ్ కు ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.



## నూతన ఉత్పాదనలు

# ప్రారంభించిన బీఏఎస్ఎఫ్ ఇండియా

**కంఠేశ్వర్–నవభూమి:** బిఏఎస్ఎఫ్ రెండు వినూత్న ఉత్పాదనలను మార్కెట్లోకి తీసుకొచ్చిందని గిరిధర్ రానువ, బిజినెస్ డైరెక్టర్, అగ్రికల్చరల్ సొల్యూషన్స్, బిఏఎస్ఎఫ్ ఇండియా తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వాలెక్సియో, మిబెల్యా, భారతీయ వరి రైతులకు మెరుగైన మరియు అత్యధిక నాణ్యమైన దిగుబడులు సాధించడానికి ఇవి సహాయపడతాయన్నారు. బిఏఎస్ఎఫ్ వారి వినూత్నమైన ఆధునిక కెమిస్ట్రీ అయిన వాలెక్సియా కీటకనాశనిని ప్రపంచంలోనే మొట్టమొదటగా భారతీయ వరి రైతులకు అందిస్తున్నారన్నారు. ప్రెక్సియో యాక్టివ్ తో శక్తివంతమైన కీటక నాశిని వరిలో దోమపోటును నియంత్రిస్తుందన్నారు. మిబెల్యా శిలీంద్రనాశిని భారతదేశంలో మొదటగా ప్రారంభించబడుతున్న రెవిసోల్ కెమిస్ట్రీ, ఇది తన యొక్క అనుకూలమైన రెగ్యులేటరి ప్రొఫైల్ మరియు సెలెక్టివిటిని తెగుళ్ళ నుంచి వరి పంటను రక్షిస్తుంది. వీటిని ప్రారంభించడం ద్వారా విశ్వ వ్యూహంలో భాగంగా వరి పంటపట్ల తనకు గల నిబద్ధతను బిఏఎస్ఎఫ్ చాటుకుంటోంది. వరి రైతులకు సమగ్ర పరిష్కారాల పోర్టుఫోలియోను అందిస్తోందన్నారు. హైదరాబాద్, ఇండియా బిఏఎస్ఎఫ్ ఇండియా తన ఆధునిక గ్లోబల్ పంటరక్షణ పరిష్కారాల్లో రెండు రకాలు అయిన వాలెక్సియా కీటకనాశినిని, మిబెల్యా శిలీంద్రనాశినిని ప్రారంభించింది. భారతదేశంలో అత్యంత ముఖ్య ఆహార పంట అయిన వరి పంటకు ఇవి సేవలందిస్తాయి. ఈ రెండు వినూత్న పరిష్కారాలను ప్రవేశపెట్టడం భారతదేశపు జాతీయ ఆహార భద్రత ఎజెండాకు సహాయపడుతుంది. వరి పంటకు తీవ్ర నష్టం కలిగించే కీటకాలైన దోమ పోటును అదుపుచేయడం, పొడ తెగులు లాంటి తెగుళ్ళను నియంత్రించడం ద్వారా వరి రైతులు తమ పంట దిగుబడులను పెంచుకోవడానికి ఈ పరిష్కారాలు సహాయపడతాయి.



# రక్తదానం చేసి ప్రాణదాతలవ్వండి: డీఈఓ




**కంఠేశ్వర్–నవభూమి:** రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ తెలియజేశారు. ఏ మేరకు గురువారం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నగరంలోని కోట గల్లీలో గల ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన జిల్ల విద్యాశాఖ అధికారి అశోక్ మాట్లాడుతూ.. రక్తదానం అన్ని దానలకన్న గొప్పదని, రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని అన్నారు. ఇలాంటి కార్యక్రమాలు చేస్తున్న రెడ్ క్రాస్ సొసైటీను అభినందిస్తూ,ప్రతి పాఠశాలలో రక్తదాన అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. సుమారుగా 40 మంది రక్తదానం చేయడం స్ఫూర్తిదాయకం అని దానిలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనడం గర్వకారణం అని అన్నారు. ఈ కార్యక్రమంలో అర్బన్ మండల విద్యశాఖ అధికారి సాయిరెడ్డి, రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ ఆంజనేయులు, సభ్యులు తోట రాజశేఖర్, రవి స్టేట్ టీచర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ధర్మేందర్, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలు యువకులకు ఎంతో అవసరం: ఎస్సై



**మద్నూర్–నవభూమి:** క్రీడలు శరీరకంగా మానసికంగా ఎంతో ఉపయోగ పడతాయని క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభోత్సవంలో ఎస్సై విజయ్ కొండ తెలిపారు. మండల కేంద్రంలోని సోమలింగాల గుట్ట ప్రాంతంలో శ్రీ వెంకటేశ్వర గ్రూప్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడా పోటీలను ఎస్సై గురువారం నాడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. యువతకు క్రీడలు ఎంతో అవసరమని క్రీడలు శారీరకంగా మానసికంగా ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. క్రికెట్ టోర్నమెంట్ను టాస్ ఎగరవేసి బ్యాటింగ్ తో ఎస్సై ప్రారంభించారు. ఈ క్రీడా పోటీల ప్రారంభోత్సవంలో మిర్జాపూర్ హనుమాన్ టెంపుల్ చైర్మన్ రామ్ పటేల్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు హనుమాన్ల స్వామి, మరో నాయకుడు పట్టణాల రమేష్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వాహకులు, యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ కవర్ల వినియోగంపై అవగాహనా

**కంఠేశ్వర్–నవభూమి:** ప్రపంచ పర్యావరణ దినోత్సవాలలో భాగంగా గురువారం 8వ రోజు హెల్త్ ఇన్స్పెక్టర్ ప్రేమ సాగర్ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ కవర్ల వినియోగం వల్ల పర్యావరణపై దాని దుష్ప్రభావం గురించి ప్రయాణికులకు అవగాహనా నిమిత్తం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సాధార్భంగా డివిజనల్ వైద్యాధికారి దీప మాట్లాడుతూ..ప్లాస్టిక్ బాగ్స్ వినియోగం పర్యావరణంపై ఎక్కువ దుష్ప్రబ్భావం చూపుతుంది. అని ప్లాస్టిక్ బాగ్స్ భూమిలో కలసిపోవుటకు సుమారు 10 నుండి 500 సంవత్సరాల కాలంపడుతుందని, ప్లాస్టిక్ బాగ్స్ చిన్న చిన్న ముక్కలుగా చేసి పడ వేసిన కూడా జీవోదో కరణ చెందని స్వభావం వల్ల అది భూమిలో కలవదని అందువలన పర్యావరణ నికి ముప్పు ఎక్కువగా ఉంటుందని అదే విధంగా ప్లాస్టిక్ బాగ్స్ లో వినియోగించిన ఆహార పాదార్థాలనూ చెత్తకుండిలలో వేయుట వలన మూగ జీవాలు తిని అనారోగ్య పాలు అవుతున్నాయని కావున ప్లాస్టిక్ బాగ్స్ వినియోగం స్వచ్చందంగా ప్రతిఒక్కరు జ్యూట్ లేదా గుడ్డ సంచిలని వినియోగించాలని ప్రయాణికులను అభ్యర్థించారు.

# మంత్రివర్గంలో తోటకు చోటు దక్కేనా



**మద్నూర్–నవభూమి:** మంత్రివర్గ విస్తరణ కోసం కసరత్తులు జరుగుతున్న వేళ జుక్కల్ కు మంత్రివర్గంలో చోటు దక్కేనా అనే చర్చలు జుక్కల్ నియోజకవర్గం ప్రజల్లో కొనసాగుతున్నాయి. భారతదేశంలో రాష్ట్రాలు ఏర్పడగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిన నాటి నుండి నేటి వరకు జుక్కల్ నియోజకవర్గానికి ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా ఏ ఒక్క ఎమ్మెల్యేకు కూడా మంత్రివర్గంలో చోటు దక్కలేదు. జుక్కల్ నియోజకవర్గాన్ని 1978లో ఎస్సీ రిజర్వుడు కాన్స్టెన్సీగా ఏర్పాటు చేశారు. ఇప్పటికి 47 సంవత్సరాలైనా నియోజకవర్గానికి గెలుపొందిన ఏ ఒక్క ఎమ్మెల్యేకు కూడా మంత్రివర్గంలో చోటు దక్కలేదు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంలో జుక్కల్ ఎమ్మెల్యేగా తోట లక్ష్మీ కాంతారావు గెలుపు పొందడం, మంచి విద్యావంతుడై ఉన్నప్పటికీ మంత్రివర్గంలో చోటు కల్పించలేకపోయారు. అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని విద్యావంతుడైన తోటకు మంత్రివర్గంలో చోటు కల్పించాలని జుక్కల్ నియోజకవర్గం ప్రజలు రాష్ట్ర ప్రభుత్వానికి కోరుకుంటున్నారు.

# నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు




**పెద్దవంగం–నవభూమి:** నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని ఎస్సై క్రాంతి కిరణ్, తహశీల్దార్ మహేందర్, మండల వ్యవసాయాధికారి గుగులోత్ స్వామి నాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పలు విత్తన, ఎరువుల దుకాణాల్లో టాస్కోర్స్ బృందం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు డీలర్ షాపు నందు స్టాక్ రికార్డులు, బిల్స్ పరిశీలించారు. ఎవరైనా నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలతో పాటు పీడీ యాక్ట్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. విత్తన డీలర్లకు విత్తనాలు పర్మిషన్ ఉన్న కంపెనీ నుంచి మాత్రమే తీసుకోవాలన్నారు. సీడ్ లైసెన్స్ కొనుగోలు దారులకు కనిపించే విధంగా పెట్టాలని, ధరల పట్టిక రైతులకు కనిపించే విధంగా ఉంచాలన్నారు. బ్లాక్ మార్కెటింగ్ చేయరాదని హెచ్చరించారు. ఎమ్మార్పీ ధరలకు మించి అమ్మితే చర్యలు తప్పవన్నారు. అదే విధంగా నిషేధిత బీటీ–3 విత్తనాలు ఎవరైనా అమ్మితే వ్యవసాయ శాఖ అధికారులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు ఎరువుల దుకాణాల యజమానులు పాల్గొన్నారు.

# సీఎం సహాయ నిధి పథకం.. పేదలకు వరం

**తాడ్వాయి–నవభూమి:** సీఎం సహాయ నిధి పథకం పేదలకు వరమని తాడ్వాయి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ పులి సంపత్ గౌడ్ అన్నారు. గురువారం మండలంలోని మేడారంలో రూ.1,10,000 విలువ గల రెండు సీఎం సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం సహాయ నిధి పథకం వల్ల పేదలకు ఎంతో ఆర్థిక మేలు జరుగుతుందన్నారు. వేలాదిమంది పేద మధ్యతరగతి ప్రజలకు (రోగులకు) సీఎం సహాయనిధి ద్వారా ఆర్థిక చేతను అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ టి సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పీరీల వెంకన్న, గ్రామ కమిటీ అధ్యక్షులు గడిగా అనిల్, నాయకులు రమేష్, సీనియర్ నాయకులు అట్టం సమ్మయ్య, యూత్ అధ్యక్షులు సిద్ధబోయిన పూజారావు, ఊరటం గ్రామ కమిటీ అధ్యక్షులు కోటే నరసింహులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కేటీఆర్‌పై కవిత సంచలన ఆరోపణలు



**–నవభూమి:** రాష్ట్రంలో కొత్త పార్టీ పెడతారనే ఊహాగానాల నేపథ్యంలో ఎమ్మెల్సీ కవిత జోరు పెంచారు. బీఆర్ఎస్‌లోని అగ్రనేతలే టార్గెట్‌గా ఆమె విమర్శనాస్త్రాలు సంధించారు. ఇవాళ కవిత మీడియాతో చిట్‌చాట్ చేస్తూ.. దేశం బయట సోషల్ మీడియా, మొబైల్ ఫోన్లు పెట్టుకుని తనపై కొందరు కుట్రలు చేస్తున్నారు ఆరోపించారు. ఆ తెలివితేటలు ప్రతిపక్షాలపై చూపించండి తనపై కాదని హితవు పలికారు. నాకు నీతులు చెబుతున్న వాళ్లంతా నీళ్ల వివాదంపై మాట్లాడితే బాగుంటుందని ధ్వజమెత్తారు. ట్విట్టర్‌లో ట్వీట్లు చేస్తే సరిపోదని.. క్షేత్రస్థాయిలోకి వెళ్లి ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఉందని కేటీఆర్‌ను ఉద్దేశించి కామెంట్ చేశారు. ఆడబిడ్డ మీద పెయిడ్ ఆర్టిస్టులతో మాట్లాడిస్తే ఏం రాదని.. తాను అసలే మంచిదాన్ని కాదని.. నోరు విప్పితే తట్టుకోలేరని అన్నారు. కేసీఆర్‌ను నడిపించేంత పెద్దోళ్లా మీరు అంటూ కవిత ఫైర్ అయ్యారు.ఇక పార్టీ సోషల్ మీడియా తనను టార్గెట్ చేసిందని.. తప్పుడు వార్తలు రాస్తే పార్టీ ఎందుకు ఖండిచడం లేదని ప్రశ్నించారు. తన డిమాండ్ ఒక్కటేనని.. లేఖను ఎవరు లీక్ చేశారో చెప్పి తీరాలన్నారు. కేసీఆర్‌కు నోటీసులిస్తే ఎందుకు నిరసనలు చేయడం లేదని అన్నారు. అదే మరో నేతకు నోటీసు ఇస్తే ఎందుకు హంగామా చేస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నేను వాళ్లలాగా చిచోరా రాజకీయాలు చేయనని హుందాగా ఉండే వ్యక్తినని అన్నారు.కేసీఆర్ మాత్రమే నాకు నాయకుడు..బీఆర్ఎస్ ను గంపగుత్తగా బీజేపీకి అప్పగించాలన్న ప్రయత్నం పార్టీలో జరుగుతోంది. జైలులో ఉన్నప్పుడే ఆ ప్రతిపాదన వస్తే నేను గట్టిగా వ్యతిరేకించాను. బీజేపీలో బీఆర్ఎస్ విలీనం కాకుండా స్వతంత్రంగా ఉండాలన్నదే నా అభిమతం. నాపై దుష్ప్రచారం చేస్తున్నా పార్టీ స్పందించలేదు. నన్ను పార్టీ నుంచి ఎవరు బయటకు పంపుతారు?.. అంత సీన్ ఎవరికీ లేదు. కాంగ్రెస్‌తో సంప్రదింపులు జరిపినట్టు జరుగుతున్న ప్రచారం పచ్చి అబద్ధం. బీఆర్ఎస్‌లో కేసీఆర్ మాత్రమే నాకు నాయకుడు.. ఆయన నాయకత్వంలోనే పనిచేస్తాను. వెన్నుపోటు పొడవడం నా లక్షణం కాదు%ొ% నేరుగానే పోరాడతాను.నాపై దాడి చేయమని ఎవరు చెప్పారు కేసీఆర్‌కు నోటీసులు ఇస్తే నేతలెవరూ స్పందించకపోతే ఎలా? నాకు నీతులు చెబుతూ కోవర్టులు ఉన్నారంటున్నారు. నా మీద పడి ఏడిస్తే ఏంటి ఉపయోగం? ఇంటి ఆడబిడ్డ గురించి ఎలా పడితే అలా మాట్లాడిస్తే అది మర్యాదేనా? లిక్కర్ కేసు సమయంలో రాజీనామా చేస్తానంటే వద్దని వారించింది కేసీఆర్ కాదా? సొంత పార్టీ వాళ్లే కుట్రపూరితంగా నన్ను ఎంపీగా ఓడించారు. అదే జిల్లాలో ప్రొటోకాల్ ఉండాలని కేసీఆర్ నాకు ఎమ్మెల్సీ ఇచ్చారు. లీకు వీరులను ఎండగట్టమంటే నాపై ప్రతాపం చూపుతున్నారు. కాంగ్రెస్, బీజేపీపై మాట్లాడాలి కానీ.. నాపై దాడి చేస్తే ఎలా? నాపై దాడి చేయమని ఎవరు చెప్పారు

# నాలుగైదు రోజుల్లో ధాన్యం సేకరణ పూర్తి.!

**మల్హార్ –నవభూమి:** అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను నాలుగైదు రోజుల్లో పూర్తి చేస్తామని తాడిచెర్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ ఇప్ప మొండయ్య అన్నారు. మండలంలో కొయ్యూర్, వళ్లెంకుంట గ్రామాల్లో పిఏసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిదాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం సూచించిన ప్రకారం రైతుల ధాన్యం పూర్తి స్థాయిలో సేకరిస్తామన్నారు. మండలంలో అన్ని గ్రామాల్లో ఏర్పాటు చేసిన 13 కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ పూర్తి చేస్తున్నారు. రైతులు ఎలాంటి ఆందోళనకు గురికావొద్దన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అయిత రాజిరెడ్డి,



# ఎన్టీఆర్ పెట్టిన రాజకీయ బిక్ష

## మీ దయతో రాజకీయాయాల్లో నిఖార్సుగా నిటారుగా నిజాయితీగా నిలబడ్డా
## నా జీవితం ప్రజలకే అంకితం
## ఎన్టీఆర్ విగ్రహావిష్కరణలో మంత్రి తుమ్మల



**కొత్తగూడెం మే 29 నవభూమి ప్రతినిధి:** దమ్మపేటలో తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహాన్ని రాష్ట్ర వ్యవసాయ సహకార, మార్కెటింగ్ చేనేత జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర రావు గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మంత్రి ఉద్వేగంగా ప్రసంగించారు.

ఈ అద్భుత కార్యక్రమానికి యుగపురుషుడి విగ్రహావిష్కరణకు దాతగా ఎన్టీఆర్ అభిమానిగా విగ్రహావిష్కరణకు రావాలని సత్యం ఆహ్వానించారని, నియోజకవర్గ ఇన్చార్జి ఎన్టీఆర్ అభిమానులు అందరికీ మంత్రి తుమ్మల పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. సహచర మిత్రులు తాటి వెంకటేశ్వర రావు, మెచ్చ నాగేశ్వరరావు. ఎన్టీఆర్ సృష్టించినటువంటి పార్టీ ప్రజల కోసం, రాష్ట్రం కోసం పనిచేసింది. ఆయన పథకాలు ఈనాడు భారతదేశ వ్యాప్తంగా ప్రాచుర్యం పొందాయాన్నారు. ఏ రాష్ట్రంలో ఏ పార్టీ ఉన్న ఎన్టీఆర్ సంక్షేమ కార్యక్రమాలను పక్కన పెట్టి పరిపాలించే శక్తిధైర్యం సాహసం ఈనాడు ఏ పార్టీకి లేదన్నారు. ఆయన నోటి వెంట వచ్చినటువంటి ఆణిముత్యాలు లాంటి పేదల బడుగుల కోసం, బలహీన వర్గాలు రైతుల కోసం ఆయన చేసిన నిర్ణయాలు ఈ రోజుకి కొనసాగిస్తున్నారన్నారు. ఆ రోజు రెండు రూపాయలకే కిలో బియ్యం ఇచ్చి నిరుపేదలు రెండు పూటలా అన్నం తినేటటువంటి మహాభాగ్యాన్ని, ఇల్లు లేని నిరుపేదలకు పక్కా ఇల్లు ఇచ్చి నిర్మించిన మహానుభావుడు. ఆయన కట్టుకోవడానికి బట్టలు కూడా దొరకని పరిస్థితుల్లో జనతా వస్త్రాల ఇచ్చి గౌరవాన్ని కాపాడారని, విద్య వైద్యం కోసం ఈ రాష్ట్రంలో నీటిపారుదల కోసం అనేక కార్యక్రమాలను ఆయన ఉన్నటువంటి పదవీకాలంలో రెండు రాష్ట్రాలను కూడా అభివృద్ధి పదంలో నడిపి అటు గోదావరిగోదావరి, కృష్ణా జలాల్ని బీడు భూములకు మళ్లించిన గొప్ప దార్శనికుడు ఎన్టీ రామారావు. ఆ మహానుభావుడు పుట్టుకే ఒక అద్భుతం, ఆయన జీవితమే ఒక ఆదర్శం, ఆయన నిస్వార్థమైనటువంటి రాజకీయ నాయకుడు కాదు, ఒక మానవతా మూర్తి అన్నారు. ఏ పార్టీలో ఏ నాయకుడు ఉన్నా తెలుగుదేశం నుంచి వచ్చిన నాయకులే ఉంటారన్నారు. ముఖ్యమంత్రులు ఆ పార్టీలో గాని ఏ పార్టీలో గాని ఇంకా నిలబడి ఉన్నారంటే తెలుగుదేశం నుంచి వచ్చినసరుకే నికార్స్ అయిన సరుకని అన్నారు. ఆయన నిబద్ధత ఆయన ఆలోచన విధానాన్ని ఆకలింపు చేసుకుని పేదల కోసం, బడుగుల కోసం ప్రాంతం అభివృద్ధి కోసం పనిచేసినటువంటి నాయకులే ఇప్పటికీ 75 సంవత్సరాలు వచ్చినా రాజకీయాల్లో నాయకులకు కొనసాగుతున్నారన్నారు. అదే ఎన్టీఆర్ గొప్పతమన్నారు. భవిష్యత్తులో కూడా ఆయన తయారు చేసినటువంటి సంతతి రాజకీయాల్లో స్థిరంగా మన గలుగుద్ది. మనం కూడా ఆయన ఆశయాలకు తగ్గట్టుగానే 40...43 సంవత్సరాలుగా కొనసాగామని తాటి వైసిపి లో చేరిన, మెచ్చ టిఆర్ఎస్ కి వెళ్ళినా నేను కాంగ్రెస్ కి వెళ్లిన ప్రజలు గౌరవిస్తున్నారంటే వీళ్ళు ఎన్టీఆర్ బిడ్డలు, వీళ్ళని నికార్స్ గా ఉంటారని ఆలోచనతోనే ఎవరైనా వచ్చి మా ఇంటికి తీసుకువెళ్లారు తప్ప మేము ఎవరి ఇంటికి వెళ్లి అడగలేదని గుర్తు చేశారు. ప్రజలు వెళ్లమంటే వెళ్లామే తప్ప నాకు ఈ పదవులు ఇవి అవసరం లేదు. గోదావరి జలాలు దమ్మపేట మండలానికి రావాలి, అశ్వరావుపేట పెద్ద చెరువుకి సత్తుపల్లి ఈ సంవత్సరమే సత్తుపల్లి వేంసూరు మండలానికి తప్పకుండా వస్తాయన్నారు.

జిల్లాను బతికించాలంటే నా తల్లి గోదావరి తీసుకురావాలని ఆ రోజే దుమ్ముగూడెం మొదలుపెట్టామన్నారు. మళ్లీ తనకు వచ్చిన అవకాశం ద్వారా సీతారామ ప్రాజెక్టుగా కొనసాగించడం, తప్పకుండా ఈ సంవత్సరం సత్తుపల్లి మండలానికి వచ్చే సంవత్సరం అశ్వరావుపేట మండలానికి నీళ్లు వస్తాయన్నారు. భూగర్భ జలాలు అడుగంటుతున్నాయని 300, లేదా 600 అడుగుల్లో లోతులో బోర్లు వేసి వ్యవసాయం చేసే రోజులు వచ్చాయన్నారు. ఆయిల్ పాము కొనసాగాలంటే భూగర్భ జలాల పుష్కలంగా ఉండాలన్నారుగోదావరి తల్లి మన ముంగిటికి రావాలన్నారు. నాకు ఉన్నటువంటి అవకాశాల ద్వారా మీరు జాతీయ రహదారులు చూస్తున్నారన్నారు. రవాణా సౌకర్యాలు ఉంటే గిరిజన గ్రామాలు ఎన్టీఆర్ దమ్మపేటను ఆదర్శ మండలంగా తీర్చిదిద్దారన్నారు గుర్తు చేసుకున్నారు. తెలంగాణ రాష్ట్రం లో పామాయిల్ ఫ్యాక్టరీ కి వచ్చి వెళుతున్నారంటే ఎన్టీఆర్ ఆ నాడు దమ్మపేట మండలాన్ని ఆదర్శ మండలంగా తీర్చి దిద్దిన ఫలితం. 40 ఏళ్లుగా రాజకీయాల్లో కొనసాగుతున్నానంటే ఎన్టీఆర్ దయ, సత్తుపల్లి నియోజకవర్గం ప్రజలు ఇచ్చిన అవకాశం వల్లనే అని గుర్తు చేసుకుని, కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలపాటి రామచంద్రప్రసాద్, గడ్డిపాటి సత్యం, కట్రం స్వామి, కృష్ణయ్య, పైడి వెంకటేశ్వరరావు, దొడ్డాకుల రాజేశ్వరరావు, ఎల్లిన రాఘవరావు, బండి భాస్కర్, మొగళ్లపు చెన్నకేశవులు, రావు గంగాధర్రావు, కొయ్యల అచ్యుతరావు, తెదేపా మండల అధ్యక్షుడు వలీపాష, కేవీ సత్యనారాయణ, దొడ్డా ప్రసాద్, ఉమ్మడి జిల్లాలోని పలు మండలాల ఎన్టీఆర్ అభిమానులు పాల్గొన్నారు.

